క్లుప్తంగా

వైభవంగా రథయాత్ర

ముదినేపల్లి రూరల్: షష్ఠి ఉత్సవాల్లో భాగంగా సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ రథయాత్ర సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించి రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు కొబ్బరికాయలు కొట్టి రథ యాత్రను ప్రారంభించారు. సింగరాయపాలెం, చేవూరుపాలెం, శ్రీహరిపురంలోని వీధుల్లో రథయాత్ర భక్తజన సందోహం మధ్య కొనసాగింది. ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిరు వ్యాపారులకు ఫిన్‌వెస్కో బ్యాంక్ అండ

గుడివాడ టౌన్: ఫిన్‌వెస్కో క్యాపిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ శాఖ ఏడాదిలోనే పలు విజయాలు సాధించిందని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జక్కంపూడి రవీంద్ర తెలిపారు. సోమవారం బ్యాంక్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చిరు వ్యాపారులకు, మహిళా సంఘాలకు స్వల్పకాలిక రుణాలు అందజేస్తూ తమ శాఖ ఈ ఏడాది రూ.3.87 కోట్లు వ్యాపారం చేసిందన్నారు. డైరెక్టర్ అలమండ రాకేష్, ఏరియా మేనేజర్ బి.శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్ కె. రత్నశేఖర్, ఎస్.విజయభాస్కర్ పాల్గొన్నారు.

భూ పోరాట యోధుడు దత్తు

పెదపూడి(మొవ్వ): చల్లపల్లి జమీందారులతో పేదల కోసం పోరాడి ఐదు వేల ఎకరాలు పేదలకు పంపిణీ చేయించిన ఘనత నాటి పోరాట యోధుడు దోనేపూడి దత్తుకే దక్కుతుందని కృష్ణా జిల్లా సీపీఐ సమితి కార్యదర్శి టి.తాతయ్య పేర్కొన్నారు. మొవ్వ మండలం కూచిపూడి–పెదపూడి సెంటర్లోని చలసాని కాంచన రావు సీపీఐ కార్యాలయంలో దోనేపూడి దత్తు వర్ధంతిని సోమవారం నిర్వహించారు. దత్తు చిత్రపటానికి పూల మాలలేసి నివాళులర్పించారు. నాయకులు పరుచూరి అజయ్‌కుమార్, చెరుకు శ్రీనివాసరావు, వెంకటఅప్పారావు, నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, నరసింహరాజు పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట

పమిడిముక్కల: కూటమి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. కృష్ణాపురం ముత్రాసిపాలెంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని సోమవారం ప్రారంభించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పక చదివించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటరమణకుమారి, ఎంఈఓ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ గంజాల సీతారామయ్య, సర్పంచ్ వీరంకి బలుసలమ్మ, హెచ్ఎం ఫికోల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రహదారి వెంబడి ఆరబోసిన ధాన్యం రాశులను ఎమ్మెల్యే పరిశీలించి, రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దళారులను నమ్మి మోసపోద్దని, ప్రభుత్వానికి విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ పాల్గొన్నారు.

ఆటపాకలో చెత్త తొలగింపు

కైకలూరు: పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి ఆటపాక పంచాయతీ పరిధి వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీనుంచి పాత రిలయన్స్ పెట్రోలు బంకు వరకు చెత్తను సోమవారం తొలగించారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఈఓపీఆర్డీ కొండలరావు పంచాయతీ కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

నాగాపురం(పెదపారుపూడి): మండలంలోని నాగాపురంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపుపై సోమవారం దాడి చేసి, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ ఎం.ఆశాలత తెలిపారు. నాగాపురం గ్రామానికి చెందిన నాగదేశి విజయ్‌ప్రకాష్ అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈ దాడిలో నాలుగు ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వైభవంగా పడి పూజ



ముదినేపల్లి రూరల్: పేరూరు అయ్యప్ప స్వామి పడి పూజ ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సోమా సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పాల్గొన్నారు.

పశుగ్రాసానికి మహా గిరాకీ

- ఎకరం వరిగడ్డి రూ.10 వేలు
- పశువులకు మేత కొరత

గుడ్లవల్లేరు: వరుస తుపాన్ల కారణంతో ప్రతికూల వాతావరణ పరిస్థితుల రీత్యా యంత్రాలతో వరిని రైతులు శరవేగంగా కోత కోయించారు. ఈ ప్రభావంతో పశుగ్రాసం దొరక్కపోవడంతో పశువులు అల్లాడుతున్నాయి. గుడ్లవల్లేరు మండలంలో ఆవులు, గేదెలు వెరసి 14,130 ఉన్నాయి. వరిగడ్డి కొనాలన్నా పాడి రైతుకు మహా భారంగా మారింది. ఎకరం గడ్డి రూ.10 వేలు పలుకుతోంది. బయట ప్రాంతాలకు చెందిన పాడి రైతులకు ఇక్కడి వరిగడ్డిని కిరాయికి వాహనాలను ఏర్పాటు చేసుకుని తీసుకెళుతున్నారు. దీంతో స్థానికంగా పశువులకు పశుగ్రాసం కరువైంది.



వరిగడ్డిని తరలించేందుకు లారీలకు లోడ్ చేసిన దృశ్యం

పశు పోషకులకు భారం

మేత కొరతతో మూగ జీవాలు ఆకలితో అలమటిస్తున్నాయి. పశు పోషకులకు పాడి పరిశ్రమ భారంగా మారింది. రైతులకు కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవటంతో అగమ్యగోచర పరిస్థితుల్లోకి జారిపోతున్నారు. దాణాకు డిమాండ్ పెరగటంతో పాల కేంద్రాల నిర్వాహకులు కూడా చేతులెత్తేస్తున్నారు. పాల కేంద్రాల్లో కూడా పాల శాతం సాకుతో ధరలు తగ్గిపోతున్నాయి. పశు సంవర్ధక శాఖ వారు గడ్డి పెంపకానికి ప్రణాళికలను ఇప్పటికైనా సిద్ధం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆకాశాన్ని అంటుతున్న పశువుల దాణా

పశువుల దాణాను కొనుగోలు చేసి పశువులకు పెట్టాలన్నా.. ఆ ధరలూ ఆకాశన్నంటుతున్నాయి. 25 కిలోల తవుడు కట్ట రూ.725, 25 కిలోల మిక్సర్ కట్ట రూ.800, 40 కిలోల చెక్క రూ.725కు విక్రయిస్తున్నారు. దీంతో ఈ ధరలను తట్టుకోలేక పోతున్నారు. వేరే గత్యంతరం లేక ఉలవలు, సజ్జలు వండి మడ్డికూడు పెడుతున్నారు.



వరిగడ్డి మేస్తున్న పశువులు

వరిగడ్డిని పొలంలోనే..



యంత్రాలతో వరి పంట కోసేటపుడు మిషన్‌లో నుంచి వరిగడ్డి కిందకు వెళ్లి పొలంలో పడిపోతుంది. తుపాను వాతావరణం నేపథ్యంలో వరికోత యంత్రాలతో కోయించాల్సి వచ్చింది. దీంతో వరిగడ్డి పశువులకు అందకుండా పోయింది.

– ఎండీ యాసిన్, బలరామపురం రైతు, గుడ్లవల్లేరు మండలం

ధర పెరిగింది



వరి కోతలను హార్వెస్టర్లతో ఎక్కువ మంది రైతులు నిర్వహించటంతో వరిగడ్డి తగ్గుముఖం పట్టింది. ఆ కారణంగా గడ్డి ధర అమాంతంగా పెరిగిన మాట వాస్తవమే. ఎకరం వరిగడ్డి రూ.10,000. ఈ విధంగా వరిగడ్డి ధర పెరగడంతో ఒక్క దాణాతోనే పశువులను పెంచటం కష్టం అవుతుంది.

– మహ్మద్ ఇసాక్, వేమవరప్పాలెం రైతు, గుడ్లవల్లేరు మండలం

సమసమాజ స్థాపనే వైఎస్సార్ సీపీ ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: సమసమాజ స్థాపనే వైఎస్సార్ సీపీ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. తాడంకిలో వైఎస్సార్ సీపీ నాయకుడు యేనుగ మస్తాన్‌రావు నివాసంలో సోమవారం జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో కుల, మత, పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు మేలు చేసినట్లు పేర్కొన్నారు. సంక్రాంతి తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని నియోజకవర్గాలకు వెళ్లి కార్యకర్తలను కలుస్తారని పేర్కొన్నారు. ఈ నెల 13న అన్నదాతల సమస్యలపై కలెక్టరేట్ల వద్ద జరిగే ఆందోళనలో రైతులు పాల్గొన్నాలని కోరారు. నిజాయతీ కలిగిన కార్యకర్తలే పార్టీకి ముఖ్యమన్నారు. ఎవరైనా పార్టీకి నష్టం కలిగిస్తే సహించేది లేదన్నారు. నియోజకవర్గ ప్రజలంతా తనకు కుటుంబసభ్యులేనని, కార్యకర్తలకు ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

నియోజకవర్గంలో తారాస్థాయికి చేరిన అవినీతి

పామర్రు నియోజకవర్గంలో అవినీతి తారా స్థాయికి చేరిందని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ విమర్శించారు. ఎమ్మెల్యేగా తాను ఏనాడూ లంచాలు తీసుకోలేదన్నారు. ప్రస్తుతం లంచాలు లేకుండా ఏ పనీ జరగడం లేదన్నారు. ఇసుక టెండర్లు వేయకుండా అడ్డుకున్నారని, మద్యం దుకాణాల్లో 30 శాతం వాటా అడుగుతున్నారన్నారు. ఉద్యోగుల బదిలీలకు ముడుపులు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. తన వద్ద అవినీతి చిట్టా అంతా ఉందన్నారు. మండల పరిషత్, పంచాయతీల్లో నిధుల కేటాయింపులో ఎమ్మెల్యే ప్రమేయం తగదన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను డమ్మీలుగా చేస్తే సహించేది లేదన్నారు. ధాన్యం అమ్మకాల్లో మద్దతు ధర దక్కక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం, మిల్లర్లు కుమ్మక్కై రైతుకు బస్తాకు రూ.300 నుంచి రూ.400వరకు నష్టం కలిగిస్తున్నట్లు ఆరోపించారు. మోసం, దుష్ప్రచారం చేసి కూటమి నాయకులు అధికారంలోకి వచ్చారన్నారు. ఆరు నెలల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. నాయకులు ఐక్యంగా ఉండి గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణ కుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, సీతారామయ్య, నాయకులు శొంఠి వెంకటేశ్వరరావు, చంద్రపాల్, యేనుగ మస్తాన్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు



బిళ్లపాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు



మామిడికోళ్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ లోకరాజు

గుడివాడరూరల్: గ్రామాల్లో రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ వాసిరెడ్డి రామ కోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని బిళ్లపాడులో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు భూ పరమైన సమస్యలను సదస్సుల్లో విన్నవించుకోవాలన్నారు. సదస్సుల్లో రైతులు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మామిడికోళ్లలో..

గుడ్లవల్లేరు: మండలంలోని మామిడికోళ్లలో రెవెన్యూ సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సదస్సులో తహసీల్దార్ బి.లోకరాజు మాట్లాడారు. రైతులకు రెవెన్యూలో ఉన్న సమస్యలను తీర్చేందుకు ప్రజల చెంతకే వచ్చామన్నారు. ఆర్ఐ పి.శివకుమార్, మండల సర్వేయరు పర్వీన్ సుల్తానా పాల్గొన్నారు.

మహేశ్వరపురం(పెదపారుపూడి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వై.రంగారావు అన్నారు. మండలంలోని మహేశ్వరపురంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి సదస్సు దోహదపడుతుందన్నారు.

ఖో–ఖో పోటీల్లో ఏఎన్నార్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: కృష్ణా యూనివర్సిటీ నిర్వహించిన అంతర కళాశాలల ఖో–ఖో పోటీల్లో తమ కళాశాల జట్టు విజేతగా నిలిచిందని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. సోమవారం విజేతలైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అంతర్ కళాశాలల మహిళా విభాగం ఖో–ఖో పోటీలు విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వరి సిద్దార్థ కళాశాల్లో శుక్రవారం జరిగాయన్నారు. ఈ పోటీల్లో తమ జట్టు ప్రతిభను ప్రదర్శించి ప్రథమస్థానం కైవసం చేసుకున్నారన్నారు. ఈ జట్టులోని టి.బాలదుర్గ, కె.అనూష, కె.చైతన్య, ఎం.దుర్గా భవానిలు త్వరలో జరగనున్న సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇంతటి ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులను కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, కోశాధికారి పి.కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, పీడీ వీర్ల గోపి పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

డైట్ హాస్టల్‌పై మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

గుడ్లవల్లేరు: రాష్ట్రంలోని డైట్‌ల సమస్యలతో పాటు అంగలూరు ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్)కు సంబంధించి 'డైట్ సమస్యలతో ఫైట్' అనే శీర్షికను సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైంది. ఆ కథనానికి అంగలూరు డైట్ ప్రిన్సిపాల్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఈఓ డాక్టర్ సలీం బాషా స్పందించారు. హాస్టల్‌పై మొలిచిన మొక్కలను వెంటనే తొలగించేందుకు ఫోను ద్వారా ఆదేశాలు ఇచ్చారు. సమగ్ర శిక్ష నుంచి రూ.3లక్షలు టాయిలెట్స్ నిర్మాణాలకు వచ్చాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తమ డైట్ ప్రాంగణంలోనే విద్యాసంస్థకు చెందిన భవనంలో బీసీ సంక్షేమ వసతి బాలికల గృహాన్ని ఛాత్రోపాధ్యాయులకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బాయ్స్ హాస్టల్ రిపేర్లు కారణంగా అందులో ఎలాంటి తరగతులు నిర్వహించటం లేదని తెలిపారు. ముగ్గురు రెగ్యులర్, ఆరుగురు డెప్యూటేషన్‌పై పని చేస్తున్న అధ్యాపకులతో బోధనకు ఎలాంటి ఆటంకం లేదని పేర్కొన్నారు. జీత భత్యాలు, బిల్లులను పూర్తి స్థాయిలో అందిస్తున్నట్లు తెలిపారు. తాను ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేస్తూనే డీఈఓగా అదనపు బాధ్యతలను సక్రమంగానే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



డైట్ హాస్టల్‌పై మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు 128 దరఖాస్తులు

గుడ్లవల్లేరు: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు సోమవారంతో ముగిశాయని తహసీల్దార్ బి.లోకరాజు విలేకరులకు తెలిపారు. ఈ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు 128 దరఖాస్తులను ఫారం–18ను పూర్తి చేసి ఆన్‌లైన్ ద్వారా తమకు సమర్పించారని పేర్కొన్నారు.

ఓవర్ లోడ్ వాహనాలతో ఇబ్బందులు

పామర్రు: భారీ ఓవర్ లోడు వాహనాలతో రోడ్లు మళ్లీ గుంటలు పడి ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని తోట్లవల్లూరు తహసీల్దార్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ జనగణన సాధన సమితి అధ్యక్షుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు సోమవారం అర్జీని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ భారీ వాహనాలు ప్రయాణిస్తే రోడ్లు ధ్వంసం అయ్యే ప్రమాదం ఉందని వెంటనే ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని అర్జీని అందజేశామని పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

అన్న సమారాధన

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక షష్ఠి మహోత్సవాలు పురస్కరించుకుని సోమవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు షష్ఠి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. సుమారు మూడు వేల మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. దేవస్థాన అభివృద్ధి కమిటీ, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

గుడివాడరూరల్: వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి సూచించారు. మండలంలోని వలివర్తిపాడులో ఏఓ అనంతలక్ష్మితో కలసి ఏడీఏ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ తెలిపిందన్నారు. కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. కోసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించే విధంగా రైతులు చర్యలు చేపట్టాలన్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పట్టాలతో కప్పుకుని కాపాడుకునే విధంగా ముందస్తు చర్యలను రైతులు తీసుకోవాలన్నారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ సిబ్బందితో మాట్లాడి ధాన్యాన్ని పరిరక్షించే చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రదీప్, వీఏఏ ఆమోస్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ, ఏఓ

విలేజ్ హెల్త్ క్లినిక్ పరిశీలన

కూచిపూడి(మొవ్వ): వైద్య ఆరోగ్యశాఖ కృష్ణా జిల్లా బృందం పర్యవేక్షణలో నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ తనిఖీల్లో భాగంగా సోమవారం మొవ్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలోని కూచిపూడి ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్)ను వైద్యాధికారుల బృందం (మచిలీపట్నం) డాక్టర్ ఎం.కృష్ణ చైతన్య, డాక్టర్ బి.క్రాంతి సంధ్య పరిశీలించారు. తొలుత భవనాన్ని రోగుల పరీక్షలకు అనుకూలంగా ఉన్నాయా లేదా అనే సమాచారాన్ని సేకరించారు. రోజుకు ఎంతమంది రోగులు వినియోగించుకుంటున్నారు, ఏయే వ్యాధులకు మందులు అందజేస్తున్నారు, సబ్ సెంటర్లో గల మందులను, అందుబాటులో లేని మందుల వివరాలను సేకరించారు. సుదీర్ఘంగా నిర్వహించిన తనిఖీల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి సయ్యద్ అమీర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డి.శంకరరావు, పీహెచ్ఎన్ శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్స్ బి విజయకుమార్, విజయకుమారి, కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ కే దివ్య తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్‌లో వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

రేపు బాబా విగ్రహ ప్రతిష్ట

ముదినేపల్లి రూరల్: వణుదుర్రు శివారు కొత్తపల్లిలో షిర్డిసాయిబాబా మందిరంలో ఈ నెల 11వ తేదీన విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు సుధాబత్తుల బాలకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన సుధాబత్తుల నాగమల్లేశ్వరరావు, వరలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

పమిడిముక్కల: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని ఉయ్యూరు ఆర్డీఓ హెలో షారేన్ రైతులకు సూచించారు. మండలంలోని గోపువానిపాలెం గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్డీఓ రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని వల్లభుని, పట్టాభిరాముని చెరువుల భూములను 10 మంది రైతుల పేర్లతో ఎల్‌పీ నంబర్లు కేటాయించిన సర్వేయర్లు, రెవెన్యూ అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామసభలో వివిధ సమస్యలపై 17 అర్జీలు అందాయని తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యార్లగడ్డ భూషయ్య, రీసర్వే డీటీ యేసుపాదం పాల్గొన్నారు.



గోపువానిపాలెంలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ

వేంకటేశ్వరుని హుండీ ఆదాయం రూ.3.65 లక్షలు

గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద ఉన్న వేంకటేశ్వర స్వామి హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె. వేణుగోపాలరావు ఆధ్వర్యంలో భక్తులు కానుకలను లెక్కించారు. రూ.3,65,953 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ తనిఖీ అధికారి వి. సుధాకర్, అండాళ్ల గోష్ఠ సభ్యులు, భజన సమాజం సభ్యులు, అర్చక స్వాములు పాల్గొన్నారు.



కానుకలు లెక్కిస్తున్న భక్తులు

నాలుగు పూరిళ్లు దగ్ధం

పమిడిముక్కల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నాలుగు పూరిళ్లు దగ్ధమైన ఘటన గురజాడ ఎస్సీ కాలనీలో సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. చెరువు కట్టపై నివసించే కట్ల శేషయ్య, రావూరి సుబ్రమణ్యం, పొట్లూరి రంగయ్య, కత్తి మాణిక్యాలరావుకు చెందిన పూరిళ్లు, ఇళ్లలోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. వీఆర్వో సాక్షి సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధితుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. తహసీల్దార్‌కు నివేదికను అందజేసినట్లు వీఆర్వో తెలిపారు.

మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేత

పాములపాడు(పెదపారుపూడి): పాములపాడు పీఏసీఎస్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ దూళ్లవానిగూడేనికి చెందిన దగాని జనార్ధనరావు అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు రూ.10 వేల చెక్కును బ్యాంక్ సీఈఓ పి.కుమారి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రత్తిపాటి హర్షవర్ధన్, దగాని లెనిన్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న బ్యాంక్ సీఈఓ కుమారి

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

మండవల్లి: మండలంలో ఈ నెల 10 నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కే గోపాల్ సోమవారం తెలిపారు. వీటిని రైతులు, ప్రజలు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

కైకలూరు: భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలు ఈ నెల 10వ తేదీ నుంచి 2025 జనవరి ఎనిమిదో తేదీ వరకు కొనసాగుతాయని ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం సోమవారం తెలిపారు.

ముదినేపల్లి రూరల్: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 11 నుంచి సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జీఎస్ సుభాని సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతులు సదస్సుల్లో పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

డాక్టర్ మనోజ్‌కు కామధేను అవార్డు

ముదినేపల్లి రూరల్: హైదరాబాద్‌కు చెందిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి స్థానిక ప్రముఖ వైద్యుడు అంబుల మనోజ్‌ను కామధేను అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆదివారం ఈ అవార్డును మనోజ్ అందుకున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ నందా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఉత్తమ తండ్రిగా ఎంపికైన వారికి కామధేను అవార్డుకు అందజేస్తారని డాక్టర్ మనోజ్ సోమవారం తెలిపారు. తన కుమార్తె వైద్య విద్యార్థిని వైష్ణవి సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ఆర్థికంగా అన్ని విధాలా సహకరించిందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశారని పేర్కొన్నారు.